www.samasamajam.in

# సమ సమాజం

ప్రశ్నించే అక్షరం... ప్రజలకోసం...

మంగళ వారం
24-1-2023

సంపుటి - 07, సంచిక-239
పేజీలు - 4 వెల రూ. 5/-

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Warangal, Medak, Karimnagar, Kammam, Vishakapatnam, Vijayawada, Ongole

## అండమాన్ ద్వీపాలకు పరమవీర చక్ర వీరుల పేర్లు

నేతాజీ జయంతి సందర్భంగా మోడీ నిర్ణయం



ఘనంగా నివాళి అర్పించిన ప్రధాని

న్యూఢిల్లీ,జనవరి23(ఆర్ఎన్ఎ): పరాక్రమ్ దివస్ సందర్భంగా అండమాన్, నికోబార్‌లోని 21 పెద్ద దీవులకు ప్రధాని మోడీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పేరు పెట్టారు. పరమవీర

2వ



## సంప్రదాయ సిద్దంగా నాగోబా జాతర

- దేవతలకు ప్రత్యేక పూజలు చేసిన మోస్రం వంశీయులు
- నేడు గిరిజన దర్బార్‌కు ఏర్పాట్లు
- హాజరు కానున్న మంత్రులు

**ఆదిలాబాద్, జనవరి 23 (సమ సమాజం):** నాగోబా జాతరలో భాగంగా మూడవ రోజు.. పెర్సాపేన్, భాన్ దేవతలకు మెస్రం వంశీయులు ప్రత్యేక పూజలు చేయనున్నారు. ఈ కార్యక్రమంలో డోలు, పెప్రే, కాలీకోమ్ ఆదివాసీ వాయిద్యాలను వాయిస్తూ ఘనంగా పూజలు నిర్వహించారు. నాగోబా జాతరలో నేడు కొత్త కోడళ్లు కొత్త పుట్టకు పూజలు చేపట్టారు. సమ్మక్క-సారలమ్మ జాతర తర్వాత.. ఆదివాసీల అతిపెద్ద పండగే.. ఈ నాగోబా జాతర. ఆదివాసీ, గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబంగా ఈ జాతర నిర్వహిస్తారు. లక్షలాదిగా తరలివచ్చిన భక్తులు.. స్వామివారికి ఎంతో భక్తి శ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈనెల 24 న గిరిజన దర్బార్ నిర్వహించనున్నారు. వేలాదిగా తరలివచ్చిన అడవి బిడ్డలతో దట్టమైన అడవి జనసంద్రంగా మారింది. పెద్దఎత్తున వచ్చిన గిరిజనులతో కేస్లాపూర్ కిక్కిరిసిపోయింది. నాగోబా జాతరను మూడు రోజులుగా ఎంతో వైభవంగా నిర్వహిస్తున్నారు ఆదివాసీలు. జాతరలో భాగంగా మూడవ రోజు.. పెర్సాపేన్, భాన్ దేవతలకు మెస్రం వంశీయులు ప్రత్యేక పూజలు చేసారు. ఈ కార్యక్రమంలో డోలు, పెప్రే, కాలీకోమ్ ఆదివాసీ వాయిద్యాలను వాయిస్తూ ఘనంగా పూజలు నిర్వహిస్తారు. కొత్తగా భేటింగ్ అయిన కొత్త కోడళ్లు మర్రిచెట్టు దగ్గర ఉన్న బావి

3వ

## జివో 317ను వెంటనే రద్దుచేయాలి

టీచర్ల పట్ల ప్రభుత్వం దమన నీతిని వీడాలి




- జివో రద్దుకు బిజెపి ఉద్యమిస్తామన్న బండి
- జివో రద్దు కోరుతూ ప్రగతిభవన్ ముట్టడికి బిజెవైఎం యత్నం
- కార్యకర్తలను అడ్డుకుని అరెస్ట్ చేసిన పోలీసులు

**హైదరాబాద్, జనవరి 23 (సమ సమాజం):** ప్రభుత్వం జీవో నంబర్ 317 ను వెంటనే సవరించాలని బీజేపీ చీఫ్ బండి సంజయ్ డిమాండ్ చేశారు. ఈ జీవో కారణంగా టీచర్లు చాలా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ జీవో ఎందరో టీచర్ల జీవితాలను చిన్నాభిన్నం చేస్తోందన్న ఆయన... 34 మంది ఉపాధ్యాయులు ఆత్మహత్య చేసుకున్న విషయాన్ని గుర్తు చేశారు. టీచర్ల విజ్ఞప్తులను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోని

3వ

## సర్జికల్ దాడులు అంతా బోగస్



పాక్ ఉగ్రవాద శిబిరాలపై దాడులు అబద్ధం అన్న దిగ్విజయ్

కాశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి పునరుద్దరిస్తామన్న రాహుల్

**జమ్మూ, జనవరి 23 (సమ సమాజం):** భారత్ జోడో వేళ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్ దుమారం రేపారు. కాశ్మీర్‌లో రాహుల్ యాత్ర సాగుతుండగా.. డిగ్గీరాజా సంచలన కామెంట్స్ చేశారు. అసలు సర్జికల్ దాడులే జరగలేదని, సర్జికల్ దాడులకు ఆధారాలు కూడా లేవన్నారు. నియంత్రణను రేఖను దాటి పాకిస్థాన్‌లోని ఉగ్రవాద శిబిరాలపై భారత బలగాలు జరిపిన సర్జికల్ దాడుల్లో ఉగ్రవాదులను చంపేశామని అబద్దాలు చెబుతూ పబ్బం గడుపుకుంటున్నారని దిగ్విజయ్ కేంద్ర ప్రభుత్వంపై

3వ


# వేగంగా తెలంగాణ అభివృద్ధి

ప్రైమ్ ఎయిర్‌ను ప్రారంభించిన కెటిఆర్

**హైదరాబాద్, జనవరి 23 (సమ సమాజం):** తెలంగాణ వేగంగా అభివృద్ధి చెందుతున్నదని మంత్రి కేటీఆర్ అన్నారు. ఇండియన్ ఇన్నోవేషన్ ఇండెక్స్‌లో తెలంగాణ రెండో స్థానంలో ఉన్నదని చెప్పారు. గత ఏడేండ్లుగా రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తున్నాయని తెలిపారు. శంషాబాద్ విమానాశ్రయంలో అమెజాన్ ఎయిర్‌కార్గో విమానమైన ప్రైమ్ ఎయిర్‌ను మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అమెజాన్ బృందాన్ని అభినందించారు. అమెజాన్ అతిపెద్ద క్యాంపస్ హైదరాబాద్‌లోనే ఉందని చెప్పారు. అమెజాన్ వెబ్ సర్వీసెస్ ద్వారా రూ.36,300 కోట్ల పెట్టుబడులు పెడుతున్నదని చెప్పారు. ఏవియేషన్ రంగంలో తెలంగాణ వేగంగా అభివృద్ధి చెందుతున్నదని వెల్లడించారు. హైదరాబాద్ విమానాశ్రయం ప్రపంచంలోనే అత్యుత్తమ ఎయిర్‌పోర్ట్ అని చెప్పారు. హైదరాబాద్ గ్రీన్‌సిటీ అవార్డును సొంతం చేసుకున్నదని తెలిపారు. హైదరాబాద్ గ్రీన్ సిటీ అవార్డును సొంతం చేసుకుందని మంత్రి పేర్కొన్నారు. ఇండియన్ ఇన్నోవేషన్ ఇండెక్స్ లో తెలంగాణకు సెకండ్ ర్యాంక్ వచ్చిందని



3వ



## ద్రౌపది ఆలయ ఘటనపై విచారణ

నలుగురు మృతితో గ్రామంలో విషాదం

**చెన్నై, జనవరి 23 (సమ సమాజం):** తమిళనాడులోని ఓ ఆలయంలో జరిగిన ఉత్సవాల్లో క్రేన్ కూలి నలుగురు మృతి చెందారు. ప్రమాదంలో మరో ఐదుగురు గాయపడ్డారు. ఈ ఘటనపై విచారణ చేపట్టారు. క్రేన్ ఉపయోగానికి అనుమతి లేదని,అయినా నిర్వాహకులు క్రేన్ ఉపయోగించారని అన్నారు. రాణిపేటలోని ద్రౌపతి ఆలయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఆదివారం రాత్రి క్రేన్ పై

3వ

## స్మితా సబర్వాల్ ఇంట్లోకి జొరబాటు ఘటన

అధికారిని సస్పెండ్ చేసిన మేడ్చల్ కలెక్టర్



**హైదరాబాద్, జనవరి 23 (సమ సమాజం):** సిఎంవో అధికారి, ఐఏఎస్ ఆఫీసర్ స్మితా సబర్వాల్ ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించిన డిప్యూటీ తహశీల్దార్ ఆనంద్ కుమార్ రెడ్డిపై అధికారులు వేటు వేశారు. ఆయనను సస్పెండ్ చేస్తున్నట్టు మేడ్చల్ జిల్లా కలెక్టర్ ప్రకటించారు. ఉత్తర్వుల కాపీని రెవెన్యూ అధికారులు చంచల్ గూడ జైలులోని నిందితుడికి అందించనున్నట్టు

3వ

## అంబర్‌పేటలో పర్యటించిన మంత్రి కిషన్ రెడ్డి

అధికారుల గౌర్హాజరుపై మండిపాటు



**హైదరాబాద్, జనవరి 23 (సమ సమాజం):** తన సొంత నియోజకవర్గమైన అంబర్ పేటలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పాదయాత్ర చేపట్టారు. పటేల్ నగర్, ప్రేమ్ నగర్ ప్రాంతాల్లో కిషన్ రెడ్డి పర్యటించారు. పాదయాత్రలో స్థానిక అధికారులు అందుబాటులో లేకపోవడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానికులు తమ సమస్యలను కిషన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. అయితే.. ఇదే విషయంపై మాట్లాడుదామంటే సంబంధిత అధికారులెవరూ అందుబాటులో

3వ

## పొంగులేటి ఆత్మీయ సభకు నేతలు

అడ్డుకున్న ఎమ్మెల్యే హరిప్రియ

**మహబూబాబాద్, జనవరి 23 (సమ సమాజం):** మహబూబాబాద్ జిల్లాలో హై టెన్షన్ నెలకొంది. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆత్మీయ సమ్మేళనానికి వెళ్తున్న కార్యకర్తలు, అభిమానులను ఎమ్మెల్యే హరిప్రియ



## ఎపిలోనూ కెసిఆర్ పాలన కోరుతున్న ప్రజలు

- తెలంగాణ పథకాలతో ప్రజల ఆదాయం పెరిగింది
- బిఆర్ఎస్‌తో కాంగ్రెస్, బిజెపిల్లో వణుకు మొదలు
- గుజరాత్‌లో ఇప్పుడు పవర్ హాలిడేలు
- మోడీ పాలనకు కాలం చెల్లింది: జగదీశ్ రెడ్డి

**నల్గొండ, జనవరి 23 (సమ సమాజం):** ఏపీలో కేసీఆర్ పాలన రావాలని కోరుకుంటున్నారని మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. అక్కడా రైతులు 24 గంటల కరెంట్ కోరుకుంటున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అభివృద్ధి పథకాలతో ప్రతి ఒక్కరి ఆదాయం పెరిగిందని మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. గుజరాత్‌లో




3వ

## నేడు కొండగట్టుకు జనసేనాని పవన్ కళ్యాణ్

వారాహి వాహనానికి ప్రత్యేక పూజలు

ఉదయం హైదరాబాద్ నుంచి బయలుదేరనున్న పవన్

**జగిత్యాల, జనవరి 23 (సమ సమాజం):** జనసేనాని ప్రచార రథం వారాహి మంగళవారం రోడ్డెక్కనుంది. కొండగట్టు అంజన్న సన్నిధానంలో ప్రత్యేక పూజల అనంతరం తన మొదటి పరుగు ప్రారంభించనుంది. తన ఆరాధ్య దైవం ఆంజనేయస్వామికి పూజలు చేసి జనసేన అధినేత పవన్ కల్యాణ్ సార్వత్రిక సమరాన్ని ప్రారంభించ నున్నారు. మంగళవారం ఉదయం వారాహి పూజ.. అనంతరం ధర్మపురి శ్రీలక్ష్మీనరసింహస్వామి పూజలు చేయనున్నారు. అనంతరం తెలంగాణ నేతలతో సమర సన్నాహాలపై చర్చించనున్నారు. తెలంగాణలో ఎన్నికల హడావుడి మొదలైన నేపథ్యంలో ఈ సారి




3వ

## సంపాదకీయం

### సమస్యలకు సమాధానంగా బడ్జెట్ రావాలి !

మరో నాలుగైదు రోజుల్లో పార్లమెంట్ ముందుకు బడ్జెట్ ప్రతిపాదనలు రానున్నాయి. ఇప్పటికే ఏ రంగానికి

ఎంత కేటాయింపులో నిర్ణయించి ఉంటారు. అయితే ఎన్నికలకు ముందు అన్న ధోరణి చాలాకాలంగా నడు స్తోంది. అలా కాకుండా దేశంలో ప్రజలు తమ బతుకులు తాము బతికేలా చూడాల్సిన అవసరం ఉంది.

పెట్రో, గ్యాస్, ఇంటి కొనుగోళ్లు, ఉద్యోగాలకు అవసరమైన అవకాశాలు రావాలి. కేంద్రంలో ఉన్న బిజెపి కావచ్చు..రాష్ట్రాల్లో ఉన్న ముఖ్యమంత్రులు కావచ్చు...ప్రజలను దృష్టిలో పెట్టుకుని, వారి అవసరాలను దృష్టిలో పెట్టుకుని ముందుకు సాగడం లేదు. ఉన్నదాంట్లో సర్దుకుని బతుకుదామనుకున్న ప్రజలను నిద్ర పోకుండా చేస్తున్నారు. భవిష్యత్తు మీద, దేశ ప్రజల మీద ఆలోచనలు లేని ప్రభుత్వాలు ప్రజల మీద స్వారీ చేస్తున్నాయి. కరోనాతో పూర్తిగా దివాళా తీసిన ప్రజలపై ధరలతో దాడులు చేస్తున్నారు. వారి నడ్డివిరిగి లేవలేని విధంగా మోదుతున్నారు. అధికార దండంఉందికదా అన్న రీతిలో పాలకుల తీరు ఉంది.

సామాన్యుడు బతకడమెలా అన్నది ప్రభుత్వాలు ఆలోచించడం లేదు. ఏం చేస్తే బాగుపడతారు..ఎలా చేస్తే ఉపాధి దొరుకుతుంది..ఏ పథకాల వల్ల నిరుద్యోగం పోతుంది.. ఏం చేస్తే రైతులు బట్టకట్టి బతుకుతారు.. నిరుద్యోగులకు ఉపాధి లేదా ..ఉద్యోగం కల్పించడం ఎలా అన్నది పాలకులు విస్మరించారు. తాము చేసేదే గొప్ప అన్న రీతిలో పాలకులు ముందుకు సాగుతున్నారు. దేశంలో ఇంధన ధరలు చూస్తుంటే పాలకుల నిర్లక్ష్యానికి ప్రజలు బలవుతున్నారు. డబ్బు సంపాదనే ధ్యేయంగా కేంద్రం సామాన్యుల గురించి మాట్లాడడం లేదు. చాయ్‌వాలా నని ఘనంగా చెప్పు కుంటున్న ప్రధాని మోడీ గతంలో మూడుసార్లు ముఖ్యమంత్రిగా..రెండు సార్లు ప్రధానమంత్రిగా వెలుగొందుతున్నా.. సామాన్యుల నాడి పట్టడంలో విఫలమయ్యారు. జిఎస్టీ పేరుతో లక్షల కోట్లు వసూలు చేయడం పరమావధిగా ఆయన ప్రభుత్వం సాగు తోంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా రికార్డు స్థాయిలో పెట్రోల్, డీజిల్,గ్యాస్ ధరలు పెరిగాయి. పెట్రోల్, డీజిల్ ధరలతో ఓరకంగా చెప్పాలంటే సర్కార్ వ్యాపారం చేస్తుందనే చెప్పాలి. ఇబ్బడిముబ్బడిగా పన్నులు పెంచుతూ దానిని ప్రజలకు అంద కుండా చేస్తోంది. పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగితే సరుకు రవాణా భారం పెరిగి వివిధ రకాల వస్తువులపైనా ధరల మోత మోగుతుందన్న ఆలోచన లేని వారు మన పాలకులుగా ఉన్నందుకు సిగ్గుపడాలి. పెట్రోల్ అన్నది సామాన్యుని వస్తువు. కార్లు, టూ వీలర్లు ఇప్పుడు సామాన్యుల కోసం మాత్రమే అని గుర్తించాలి. రవాణా కోసం వారు వీటిని ఉపయోగించక తప్పడం లేదు. మనదేశంలో సరైన ప్రజారవాణా లేకపోవడం వల్ల సామాన్యులు సైతం టూ వీలర్లను, కార్లను ఉపయోగి స్తున్నారు. ఇదేదే ధనవంతుల విషయంగా భావించి ధరలతో బాదడం కేంద్ర పాలకుల వైఫల్యం తప్ప మరోటి కాదు. అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు తక్కువగా ఉన్నప్పుడు కేంద్రం దేశంలో ఎక్సైజ్ సుంకాన్ని పెంచింది. అయితే ఇప్పుడు ఇంధన ధరలు మండిపోతుండటంతో వినియోగ దారులపై భారాన్ని తగ్గించేందుకు సుంకాన్ని తగ్గించాల్సి కేంద్రం,రాష్ట్రాలు దాని గురించి ఆలోచించడం లేదు. సత్య వచనాలు పలుకుతున్న బిజెపి నేతలు ఈ విషయంలో ఇకనైనా ఆత్మపరిశీలన చేసుకోవాలి. ఇప్పటికే ధరలమోత, పెరుగుతున్న ద్రవ్యోల్బణం మధ్య దేశంలో వంటగ్యాస్ భారం కూడా సామాన్యులపై పడింది. కరోనా కారణంగా ఎప్పుడూ లేనంతగా ఆర్థిక వ్యవస్థ ఘోరంగా దెబ్బతింది. పెద్దఎత్తున ఉద్యోగాలు మాయమయ్యాయి. ప్రజలు ఆదాయాలు సైతం పడిపోయాయి. ఏదైనా కొత్త వైరస్ పేరు చెబితేనే ప్రజలు వణికిపోయే పరిస్థితులు నెలకొన్నాయి. బతకడమెలా అన్న దుర్భర పరిస్థితులు ఉన్నాయి. యువ భారత్‌ను ఏళ్లుగా నిరుద్యోగ సమస్య వెంటాడుతోంది. ఎప్పుడూ లేనంతగా నిరుద్యోగం

గరిష్ఠ స్థాయికి చేరుకుంది. తక్షణమే ఉద్యోగాల కల్పనకు పెద్దపీట వేయాల్సిన పరిస్థితులు నెలకొన్నా.. వాటిని ప్రభుత్వాలు విస్మరించాయి. ఇందుకోసం మౌలిక సదుపాయాల కల్పన, తయారీ రంగం, రియల్ ఎస్టేట్ రంగాలకు కేంద్రం విరివిగా ప్రోత్సాహకాలు ఇవ్వాల్సి ఉంది. అలాగే, దేశంలో ఎక్కువ మంది ఉపాధి కల్పిస్తున్న ఎంఎస్‌ఎంఈలు గత మూడేళ్ల కొవిడ్ కారణంగా చతికిల పడ్డాయి. ఇవి కోలుకోవాలంటే కేంద్రం చేయూత తప్పనిసరి. దేశంలో యువతకు ఉద్యోగాలను కల్పించాలంటే ప్రజలకు మౌలిక వసతులు కల్పించే ప్రాజెక్టులు పెద్దఎత్తున చేపట్టడం కీలకం. భవిష్యత్‌లో ప్రభుత్వ ఖజానాకు స్థిర ఆదాయం రావాలన్నా, పెద్దఎత్తున ప్రైవేటు పెట్టుబడులను రావాలన్నా ఇందులో ప్రభుత్వ పెట్టుబడులు ముఖ్యం. కానీ అలాంటి ఆలోచనలు చేయడంలో నరేంద్రమోడీ నేతృత్వంలోని ప్రభుత్వం పూర్తిగా విఫం చెందింది. ప్రజలను పట్టించుకోని పాలన సాగడంతో నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయి. ఈ క్రమంలో ప్రభుత్వం తప్పులు సరిదిద్దుకుని ముందుకు సాగాలి. అందుకు బడ్జెట్ సమావేశాల్లో ప్రణాళిక సాగాలి. బడ్జెట్ ద్వారా ప్రజల కష్టాలకు చెక్ పడాలి. ఉన్న ఆదాయవనరులను పేదలకు ఉపయోగపడేలా, సామాన్యులకు ఊరడింపు కలిగేలా చర్యలు చేయాలి. బడ్జెట్ అన్నది ఏటా జరిగే ఓ తంతుగా మారరాదు. ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో అర్థం చేసుకుని ముందుకు సాగాలి. ప్రపంచంలోనే అతిపెద్ద కార్యకర్తల యంత్రాంగం ఉన్నదని చెప్పుకుంటున్న బిజెపికి ప్రజల సమస్యలు తెలియనివి కాదు. నానా కష్టాలను అనుభవిస్తున్న తరుణంలో మోడీ ప్రభుత్వం మరోమారు ఫిబ్రవరి 1న బ్జడెట్‌ను ప్రవేశ పెట్టబోతున్నది. ప్రజలంతా నిస్సత్తువగా ఆశగా చూస్తున్న వేళ బడ్జెట్‌పై అంచనాలు వేస్తున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ఒకవైపు ఆర్థిక వ్యవస్థ ఉత్తేజానికి చర్యలు చేపడుతూనే దీర్ఘకాలంగా ఉన్న నిరుద్యోగం, ఆరోగ్య సంరక్షణ వంటి వాటిపై దృష్టి సారించాల్సి ఉంది. బడ్జెట్‌లో ఎదురు కాబోయే ముఖ్యమైన సవాళ్లను పరిగణనలోకి తీసుకుంటారా అన్నది చూడాలి.

పృధ్విరాజ్ గోసుకొండ
ఎడిటర్

# ఆర్థికస్థితి గాడిన పడేనా

**బడ్జెట్ కేటాయింపులు ఊతమిచ్చేనా● వివిధ రంగాలను ఆదుకునే ప్రయత్నం జరిగేనా● ఉద్యోగ,ఉపాధి రంగాలకు ప్రోత్సాహకం దక్కేనా**

**న్యూఢిల్లీ, జనవరి23(సమ సమాజం):** దేశంలో యువతకు ఉద్యోగాలను కల్పించాలంటే ప్రజలకు మౌలిక వసతులు కల్పించే ప్రాజెక్టులు పెద్దఎత్తున చేపట్టడం కీలకం. భవిష్యత్‌లో ప్రభుత్వ ఖజానాకు స్థిర ఆదాయం రావాలన్నా, పెద్దఎత్తున ప్రైవేటు పెట్టుబడులను రావాలన్నా ఇందులో ప్రభుత్వ పెట్టుబడులు ముఖ్యం. ఆర్‌బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ వంటి వాళ్లు సైతం మౌలిక సదుపాయాల కల్పనలో పెట్టుబడుల అవసరాన్ని పలుమార్లు ప్రస్తావించారు. దీంతో పాటు ద్రవ్యలోటును అధిగమించడం, ఆత్మ నిర్భర భారత్ సాధించే దిశగా అడుగులు వేయడం వంటి అంశాలు ఈ బ్జడెట్‌లో కీలకం కావాలి. ఈ సవాళ్లను ఎలాంటి పరిష్కార మార్గాలు చూపుతారో చూడాలి. గత కొంతకాలంగా జీఎస్టీ వసూళ్లు పెరుగు తుండటం ప్రభుత్వం తప్పుగా అంచనా వేస్తోంది. ఇదంతా ప్రజల జీవనప్రమాణాలు పెరిగాయన్న ధోరణిలో ఉంది. ప్రతి పనికి జిఎస్టీ వసూలు చేయడం దారుణం కాక మరోటి కాదు. ఇన్సూరెన్స్‌పైనా జిఎస్టీ వసూళ్లు సామాన్యులకు భారంగా మారింది. ఇదంతా అభివృద్ధికి సూచిక అన్న రీతిలో మన ప్రధాని మోడీ భావిస్తున్నారు. ప్రజల ఆదాయాలు మునుపటి స్థాయిలో లేని కారణంగా జిఎస్టీ స్లాబులను తగ్గించాలన్న డిమాండ్ వస్తోంది. అయితే, డిమాండ్‌ను బడ్జెట్‌లో చేపట్టాల్సి ఉంటుంది. ఇందుకోసం కొన్ని రాయితీలు ప్రకటించడం అనివార్యం కావాలి. కరోనా సంక్షోభం తర్వాత అన్నీ ఇప్పుడిప్పుడే సర్దుకుంటు న్నాయి. ఈ సమయంలో దేశ ఆర్థిక వ్యవస్థకు బూస్టింగ్ ఇచ్చే బాధ్యత కేంద్ర ఆర్థిక మంత్రిపై ఉంటుంది. ఇలాంటి ప్రతికూల సమయంలో పెడుతున్న బడ్జెట్ తయారీ విషయంలో మంత్రి నిర్మలా సీతారామన్ ఆచితూచి ఆడుగేయాల్సి ఉంది. బాగా దెబ్బతిన్న రంగాలను గాడిలో పెట్టాల్సిన సమయం కావడంతో ముఖ్యంగా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పెంచేందుకు ఎలాంటి నిర్ణయాలు, కేటాయింపులు చేయాలన్నదే చాలా కీలక అంశం. దేశంలో సంఘటిత, అసంఘటిత రంగాలలో అనేక మంది ఉద్యోగాలు, ఉపాధిని కోల్పోయి కనీసం బతుకు బండిని నడిపించడానికి కూడా చాలా అవస్థలు పడ్డారు. వారికి ఆశాదీపంలా బడ్జెట్ ఉంటుందని అందరూ ఆశిస్తున్నారు. బడ్జెట్ అనగానే సగటు మనిషి ఎదురు చూసేది ఆదాయపు పన్ను శ్లాబు గురించే. వార్షికాదాయం రూ. 5లక్షల వరకు పన్ను మినహాయింపు కల్పించాలన్న డిమాండ్ చాలా ఏళ్లుగా ఉంది. అయినా, గత కొన్ని బడ్జెట్‌ల నుంచి ఆ ఊసే లేకుండా పోయింది. ఇటీవల జరిపిన ఓ సర్వేలో బడ్జెట్‌లో 40 శాతం మంది పన్ను ఊరట గురించే ప్రస్తావించడం బట్టి వారి ఆకాంక్షను అర్థం చేసుకోవచ్చు. పైగా కొవిడ్ కారణంగా ఆదాయాలు పడిపోయిన నేపథ్యంలో ఈ సారి ఈ డిమాండ్ మరింత బలంగా వినిపిస్తోంది. వేతన జీవికి ఊరట కల్పించే ఈ నిర్ణయంపై ఆర్థికమంత్రి ఆలోచనల ఎలా ఉన్నాయో చూడాలి. అతలాకుతలమైన దేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టే విధంగా ఈ బడ్జెట్ ఉంటుందా? కుదేలైన సామాన్య, మధ్యతరగతి ప్రజలకు ఊరటనిచ్చే నిర్ణయాలు ఉంటాయా? వరాలు ప్రకటిస్తారా లేక పన్నులు వడ్డిస్తారా? లాంటి ఎన్నో ప్రశ్నలు ప్రతి ఒక్కరిలో ఉన్నాయి. అటు ప్రభుత్వ, ప్రతిపక్ష, పారిశ్రామిక వర్గాల్లోనే కాకుండా ఇటు సామాన్య ప్రజలు సైతం ఈ బడ్జెట్‌పై ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కూడా ఇంతకుముందెన్నడూ లేనిదిగా ఈ బడ్జెట్ తయారు చేస్తున్నట్లు ప్రకటించడంతో అందరికీ కేంద్ర బడ్జెట్ పై ఆశలు, అంచనాలు పెరిగిపోయాయి. కరోనా పుణ్యమా అని మన ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలో లోటుపాట్లు బయటపడ్డాయి. ఈ పరిస్థితుల్లో ఆరోగ్య సంరక్షణకు కేటాయింపులు పెంచాల్సి ఉంది. ఇతర దేశాలతో పోలిస్తే ఆరోగ్య సంరక్షణకు మన దేశం వెచ్చిస్తున్న మొత్తం తక్కువగా ఉందనే చెప్పాలి. భవిష్యత్‌లో కరోనా లాంటి వైరస్‌లు వచ్చే ముప్పును దృష్టిలో ఉంచుకుని ఆరోగ్య సంరక్షణ వ్యవస్థను చక్కదిద్దు కోవాలి. జీడీపీలో కనీసం ఈ రంగానికి 2.5 శాతం కేటాయింపులు జరపాలి. వైద్య రంగానికి విడిగా ఒక 'నిధి' ని ఏర్పాటు చేయడంతో పాటు వైద్య రంగంలో పరిశోధనలకు మరిన్ని నిధులు ఇవ్వాల్సిన అవసరం ఉంది.

## అండమాన్ ద్వీపాలకు పరమవీర చక్ర వీరుల పేర్లు

(మొదటి పేజి తరువాయి) చక్ర విజేతలుగా పిలువబడే ఈ ద్వీపాలకు 21 మంది పరమవీర చక్ర అవార్డు గ్రహితల పేర్లను నామకరణం చేశారు. ఏటా జనవరి 23న నేతాజీ జయంతిని పురస్కరించుకొని, పరాక్రమ్ దివస్‌గా నిర్వహిస్తూ నివాళులర్పిస్తోన్న కేంద్రం.. ఈ సారి అండమాన్, నికోబార్ లలోని పేరు లేని అతిపెద్ద దీవులకు పేర్లు పెట్టేందుకు సంకల్పించింది. నేతాజీ సుభాష్ చంద్రబోస్ జ్ఞాపకార్థం.. అండమాన్ -నికోబార్ దీవుల చారిత్రక ప్రాముఖ్యతను పురస్కరించుకుని, ప్రధాన మంత్రి 2018లో ద్వీపాన్ని సందర్శించిన సందర్భంగా రాస్ దీవులకు నేతాజీ సుభాష్ చంద్రబోస్ ద్వీప్ అని నామకరణం చేశారు. దేశం కోసం జీవితాన్ని, ప్రాణాన్ని త్యాగం చేసిన రియల్ హీరోస్ కు ప్రధాని మోడీ ఈ విధంగా వారికి నివాళులర్పించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ.. స్వాతంత్య్ర సమరయోధుడు నేతాజీ సుభాస్ చంద్రబోస్‌కు ఘనంగా నివాళులర్పించారు. జయంతి సందర్భంగా ప్రధాని మోడీ ఆయనకు నివాళులర్పిస్తూ ఓ ప్రత్యేకమైన వీడియోను విడుదల చేశారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ శౌర్యపరాక్రమానికి ఒక కర్మయోగి జీవితకాల భక్తుడు అంటూ సోషల్ మీడియా మైక్రోబ్లాగింగ్ వెబ్‌సైట్ ట్విట్టర్ వేదికగా మోడీ ఆర్కైవ్స్ ద్వారా విడుదల చేశారు. ఈ వీడియోలో ప్రధాని మోడీ పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. ఆయన తనకు మార్గదర్శకుడని దీనిలో వివరించారు. యువతకు మార్గనిర్దేశకుడని.. అందరికి స్ఫూర్తి ప్రదాత అంటూ కొనియాడారు. తనకు రాజకీయ మార్గ దర్శకుడని, రోల్ మోడల్ అంటూ పేర్కొన్నారు. తన జీవితం మొత్తం సుభాస్ చంద్రబోస్ అంకితం అంటూ ప్రధాని మోడీ వివరించారు. యువ కార్యకర్త నాటి నుంచి సుభాస్ చంద్రబోస్‌ని ఎంతలా ఆరాధించేవారో కూడా వివరించారు. ఆకాలంలో డైరీలో రాసిన పలు సూక్తులను చూపించారు. దీంతోపాటు బీజేపీ కార్యకర్తగా.. బీజేపీ జాతీయ కార్యదర్శిగా, గుజరాత్ సీఎంగా ఉన్న సమయంలో నేతాజీ సుభాస్ చంద్రబోస్ జయంతి వేడుకల్లో పాల్గొన్న కార్యక్రమాలను వివరించారు. దీంతోపాటు ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం తీసుకున్న నిర్ణయాలు, చేపట్టిన కార్యక్రమాల గురించి తెలియజేశారు. అలాగే బోస్ కుటుంబసభ్యులను కలిసిన చిత్రాలను చూపించారు. అలాగే సుభాస్ చంద్రబోస్ 125వ జయంతి సందర్భంగా భారత ప్రభుత్వం పరాక్రమ్ దివస్ గా నిర్వహించాలని తీసుకున్న నిర్ణయాన్ని కూడా చూపించారు. అలాగే కర్తవ్యపథ్ ప్రారంభోత్సవం, తీసుకున్న పలు నిర్ణయాల గురించి దీనిలో స్పష్టంగా వివరించారు. కాగా.. ప్రధాని మోడీ.. చిన్ననాటి నుంచి నేతాజీ సుభాస్ చంద్రబోస్‌ను రోల్ మోడల్ తీసుకోని.. అంచలెంచలుగా రాజకీయాల్లో పైకి ఎదిగారు. అందుకే ఆయన జయంతి సందర్భంగా పలు కీలక నిర్ణయాలను తీసుకుంటారు. దీనిలో భాగంగా నేతాజీ సుభాస్ చంద్రబోస్ జయంతిని.. పరాక్రమ్ దివస్‌గా అధికారంగా నిర్వహించాలని 2021లో కేంద్రంలోని మోడీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అప్పటినుంచి నేతాజీ సుభాస్ చంద్రబోస్ జయంతిని.. ఏటా జనవరి 23న పరాక్రమ్ దివస్‌గా నిర్వహిస్తూ స్వాతంత్య్ర సమరయోధుడికి నివాళులర్పిస్తోంది. ఈ ఏడాది పరాక్రమ్ దివస్ సందర్భంగా 21 మంది పరమవీర చక్ర అవార్డు గ్రహీతల పేర్లను.. అండమాన్ అండ్ నికోబార్ దీవులలోని పేరు లేని అతిపెద్ద 21 దీవులకు వారి పేర్లను పెట్టేందుకు నిర్ణయం తీసుకున్నారు.

## రాజ్‌భవన్‌లోనే గణతంత్ర వేడుకలు

### తాజా పరిస్థితుల నేపథ్యంలో నిర్ణయం?




**హైదరాబాద్,జనవరి23(సమ సమాజం):** గణతంత్ర దినోత్సవాలను ఈ యేడు కూడా రాజ్‌భవన్‌లోనే జరిగేలా ఉన్నాయి. రాజ్‌భవన్ కు, ముఖ్యమంత్రి కార్యాలయానికి మధ్య దూరం పెరిగినందున గవర్నర్ తమిళిసై ఈ నిర్ణయం తీసుకున్నారు. సిఎం కెసిఆర్, గవర్నర్ మధ్యన రోజురోజుకూ గ్యాప్ పెరుగుతోంది. తాజా పరిణామాలు చూస్తే అవుననే అనిపిస్తోంది. గణతంత్ర వేడుకలపై ఇప్పటివరకు రాజ్‌భవన్‌కు ప్రభుత్వం సమాచారం ఇవ్వలేదు. రాజ్‌భవన్‌లోనే రిపబ్లిక్ డే వేడుకలు నిర్వహించాలని భావిస్తున్నారు. ఉదయం జెండా ఆవిష్కరణ, సాయంత్రం ఎట్ హోమ్ నిర్వహిస్తారు. గతేడాది రాజ్‌భవన్‌లో జరిగిన 73వ గణతంత్ర వేడుకలకు కేసీఆర్ హాజరుకాలేదు. ప్రగతి భవన్ (ఖసజీణజీబితి ఃఠజీలజీని)లోనే ఉన్నప్పటికీ కూతవేటు దూరంలోని రాజ్‌భవన్‌కు రాకపోవడం అప్పట్లో చర్చనీయాంశంగా మారింది. కేసీఆర్ ప్రగతి భవన్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పరేడ్ గ్రౌండ్‌లోని అమర జవానుల స్మారక స్థూపం వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి, నివాళులర్పించిన విషయం తెలిసిందే.

## స్వచ్ఛంద సంస్థలకు బాల వికాస ఆదర్శం

### సామాజిక సేవలో సంస్థ పనితీరు భేష్● కీసర జాతీయ స్థాయి మహాసభలో మంత్రిఎర్రబెల్లి



**మేడ్చెల్, జనవరి 23 (సమ సమాజం):** స్వచ్ఛంద సంస్థలకు బాల వికాస ఆదర్శమని, సామాజిక సేవలో సంస్థ నెంబర్ వన్ అని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రశంసించారు. బాల వికాస సమాజ అభివృద్ధి పథకాల నాయకుల జాతీయ స్థాయి మహాసభ కీసరగుట్టలో జరిగింది. కార్యక్రమానికి మంత్రి హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 40 సంవత్సరాల నుంచి సంస్థతో తనకు అనుబంధం ఉందన్నారు. బాలవికాస సేవల్లో తాను పాల్గొన్నాన్నారు. సంస్థ వ్యవస్థాకురాలు బాల థెరీసా సింగారెడ్డి (బాలక్క) వర్ధన్నపేట, రెడ్డిపాలెంలో పుట్టి కెనడాకు వెళ్లి ఆంద్రే జింగ్రాస్‌ను వివాహమాడి, ఆయన ద్వారా ఇక్కడ స్వచ్ఛంద, సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నారని ప్రసంశించారు. గత 40 ఏళు ్లగా బాల వికాస ద్వారా ఎలాంటి అభివృద్ధి జరిగింది అని సమీక్ష చేసుకోవాలని, 40 ఏళ్ల కింద మహిళలు బయటకు రావాలంటే భయపడేదని, మహిళల్లో చైతన్యం కల్పించి , సంఘాలు పెట్టి ఆర్థిక చేయూత నివ్వడం ద్వారా వారికి ఆత్మ విశ్వాసం పెంచారన్నారు. గ్రామాల్లో బోర్లలో నీళ్లు రాకపోతే బాలవికాస సంస్థ 1500కిపైగా వాటర్ ఎ÷-లాంట్‌లు ఏర్పాటు చేసిందన్నారు. బాల వికాస సేవలు ఆదర్శనీయమని, స్వచ్ఛంద కార్యక్రమాలు నిర్వహించడంలో సంస్థ నెంబర్ వన్ అని అన్నారు. మనకు శిక్షణ ఇచ్చి, నాయకత్వ లక్షణాలు పెంచి, సమాజానికి ఉపయోగపడే విధంగా తయారు చేశారన్నారు. మన ఊరు మన బడి ద్వారా సీఎం కేసీఆర్ పాఠశాలలను బాగు చేస్తున్నారన్నారు. గంగదేవిపల్లిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దింది బాల వికాస సంస్థేనని, దేశంలో గొప్పగ్రామంగా నిలిచిందన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో అన్ని గ్రామాలను గంగదేవిపల్లెలా తయారు చేస్తున్నామన్నారు. గ్రామాల్లో తడి, పొడి చెత్త వేరు చేసి ఆదాయం తీసుకొస్తున్నామని, వైకుంఠధామాలు నిర్మించామని, దేశంలో 20 ఉత్తమ గ్రామాలు ఎంపిక చేసి అవార్డులు ఇస్తే 19 తెలంగాణకు వచ్చాయని గుర్తు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర విద్యా, సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ చైర్మన్ రావుల శ్రీధర్ రెడ్డి, సర్పంచ్ లక్ష్మి, సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శౌరెడ్డి సింగారెడ్డి,

## దేశంలో ఎక్కడా లేని పథకాలు



పేదలకు వరంగా కళ్యాణలక్ష్మి● చెక్కుల పంపిణీలో మంత్రి గంగుల

**కరీంనగర్, జనవరి23(సమ సమాజం):** దేశంలో ఎక్కడాలేని పథకాలు తెలంగాణలోనే అమలవుతున్నాయని, ఆడబిడ్డ పెళ్లికి కళ్యాణలక్ష్మి కింద రూ.లక్ష ఆర్థిక సహాయం అందిస్తున్న ఏకైన సీఎం కేసీఆర్ అని పౌరసరఫరాలశాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. కరీంనగర్‌లోని మంత్రి మీ సేవ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయంలో లబ్దిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. సందర్భంగా మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ గతంలో పాలకులు పేదల సంక్షేమం కోసం ఆలోచన చేయలేదన్నారు. సీఎం కేసీఆర్ పేదల బతుకులు మార్చాలన్న ఆలోచనతో అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. భవిష్యత్ తరాల బాగు కోసం ఆడబిడ్డలందరూ కేసీఆర్‌ను ఆశీర్వదించి, అండగా నిలవాలని కోరారు. రైతులకు వ్యవసాయానికి కరెంటు, రైతుబంధు కింద ఆర్థిక సాయం, ఎరువులు సకాలంలో ప్రభుత్వం అందిస్తుందన్నారు. అందరి సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తుందన్నారు. మరోసారి అధికారంలోకి వస్తే మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో మేయర్ యాదగిరి సునీల్ రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డవెని మధు,జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్ గౌడ్, కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరి శంకర్, కార్పొరేటర్లు గంట కల్యాణి, కుర్ర తిరుపతి గందె మాధవి, ఐలేందర్ యాదవ్, అర్ష కిరణ్మయి, ఆర్ష మల్లేశం, నాంపల్లి శ్రీనివాస్, గందె మహేశ్, వాసాల రమేశ్, మెచినేని అశోక్, కోల సంపత్, గంట శ్రీనివాస్ పాల్గొన్నారు.

## విజయవాడకు చేరకున్న చేగువేరా కుమార్తె

### గన్నవరం విమానాశ్రయంలో స్వాగతించిన సిపిఎం నేతలు



**విజయవాడ, జనవరి23(సమ సమాజం):** మార్క్సిస్ట్ విప్లవ శిఖరం చేగువేరా కుమార్తె అలైద గువేరా, ప్రొఫెసర్ ఎస్తిఫినా గువేరాలు సోమవారం ఉదయం గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్నారు. సిపిఎం రాష్ట్ర కమిటీ కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కేంద్ర కమిటీ సభ్యులు ఆర్.అరుణ్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు, ఆహ్వాన సంఘం కన్వీనర్లు బుడ్డిగ జమిందార్, సుంకర రాజేంద్రప్రసాద్, తదితరులు కలిసి నేతలకు ఘన స్వాగతం పలికారు. విజయవాడ ఎంబి విజ్ఞాన కేంద్రం ఆడిటోరియంలో నిర్వహించనున్న ' క్యూబా సంఘీభావ సభ ' కు అలైద గువేరా, ఎస్తిఫినా గువేరాలు హాజరుకానున్నారు.


## యువ నటుడు సుధీర్ వర్మ ఆత్మహత్య



**హైదరాబాద్,జనవరి23(సమ సమాజం):** టాలీవుడ్‌లో మరో విషాదం నెలకొంది. యువ నటుడు సుధీర్ వర్మ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయాన్ని నటుడు సుధాకర్ కోమాకుల సోషల్ మీడియా ద్వారా వెల్లడించాడు. వ్యక్తిగత కారణలతోనే సుధీర్ ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. కుందనపు బొమ్మ, సెకండ్ హ్యాండ్, షూటౌట్ ఎట్ ఆలేరు చిత్రాల్లో సుధీర్ నటించారు. ఆత్మహత్యకు సంబంధించి మరిన్ని వివారలు తెలియాల్సి ఉంది. సుధీర్ నటించిన కుందనపు బొమ్మ సినిమాలో సుధాకర్ కోమాకుల హీరోగా నటించాడు. సుధీర్ మృతి పట్ల పలువురు సినీ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.

## టీచర్ల బదిలీలుప పదోన్నతుల షెడ్యూల్ విడుదల

### 28 నుంచి 30 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరణ




**హైదరాబాద్, జనవరి23(సమ సమాజం):** రాష్ట్రంలో ప్రభుత్వ ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలకు సంబంధించిన షెడ్యూల్ విడుదలైంది. ఈ నెల 27వ తేదీ నుంచి ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల పక్రియ ప్రారంభం కానుంది. జనవరి 28 నుంచి 30వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించ నున్నారు. మార్చి 4 నాటికి ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల పక్రియ ముగియనుంది. ఈ పక్రియ మొత్తం 37 రోజుల్లో ముగియనుంది. మార్చి 5 నుంచి 19వ తేదీ వరకు అప్పీళ్లకు అవకాశం కల్పించ నున్నారు. టీచర్ల నుంచి దరఖాస్తులు అందిన 15 రోజుల్లో అప్పీళ్లను పరిష్కరించనున్నారు. టీచర్ల పదోన్నతులు, బదిలీలపై ఈనెల 15న ఉపాధ్యాయ సంఘాలు, జేఏసీల సమక్షంలో మంత్రులు హరీశ్‌రావు, సబితాఇంద్రారెడ్డి సమగ్రంగా చర్చించిన విషయం తెలిసిందే. చర్చలు ఫలప్రదం కాగా, తాజాగా సీఎం కేసీఆర్ మార్గదర్శనం, ఆమోదం మేరకు పదోన్నతులు, బదిలీల పక్రియకు ముహూర్తం ఖరారైంది. రాష్ట్రంలో బదిలీలు, పదోన్నతులపై సాధారణ పరిపాలన శాఖ గతంలో నిషేధం విధించింది. ఈ మేరకు జీవో-91ను జారీచేయగా, ఈ నిషేధాన్ని ఎత్తివేస్తూ జీఏడీ జీవోను విడుదల చేసింది.

## హిందువుల గురించి ఆలోచించేది కెసిఆర్ మాత్రమే

### బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ కార్యక్రమంలో మంత్రి హరీష్



**హైదరాబాద్,జనవరి23(సమ సమాజం):** దేశంలో హిందువుల గురించి అలోచించే వ్యక్తి సీఎం కేసీఆర్ ఒక్కరేనని మంత్రి హరీష్ రావు అన్నారు. గతంలో దేవాలయాల నిధులను ప్రభుత్వాలు వాడుకునేవని, కేసీఆర్ సర్కారు మాత్రం ప్రభుత్వ నిధులను దేవాలయాలకు ఇస్తోందని చెప్పారు. హైదరాబాద్ బొగ్గులకుంటలో బ్రాహ్మణ సంక్షేమ పరిషత్తు ఆధ్వర్యంలో వివేకానంద విదేశీ విద్యా పథకం కింద ఎంపికైన విద్యార్థులకు మంత్రి హరీష్ మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. 121 మంది బ్రాహ్మణ విద్యార్థులకు విదేశాల్లో చదువుకునేందుకు ఒక్కొక్కరికి రూ. 20లక్షల చొప్పున మంజూరు అయ్యాయని చెప్పారు. హిందూ ధర్మ పరిరక్షకులుగా ఉన్న బ్రాహ్మణులలో పేదలకు సాయం చేయాలనేది సీఎం కేసీఆర్ ఉద్దేశమని హరీష్ రావు అన్నారు. బ్రాహ్మణ సమాజ కోసం కేసీఆర్ తొలి సామూహిక భవనాన్ని సిద్దిపేటలో ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. దూపదీప నైవేద్యాన్ని రూ. 6వేలకు పెంచిన కేసీఆర్ బ్రాహ్మణ బంధువని కొనియాడారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో బ్రాహ్మణులకు ఎందుకు సాయం చేయటం లేదని హరీష్ రావు ప్రశ్నించారు.

## అంబర్‌పేటలో పర్యటించిన మంత్రి కిషన్ రెడ్డి

(మొదటి పేజి తరువాయి) లేకపోవడంతో కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము సమస్యల పరిష్కార కోసం ప్రజల్లో తిరుగుతుంటే మీ అధికారులు ఎక్కడ ఉన్నారంటూ ఉన్నతాధికారులను ఫోన్ లో కిషన్ రెడ్డి మందలించారు. వెంటనే కరెంటు సమస్యను పరిష్కరించాలంటూ అధికారులను ఆదేశించారు. బస్తీల్లో వాటర్ పైప్ లైన్ కోసం రోడ్డు మధ్యలో తీసిన కాలువలను వెంటనే లెవలింగ్ చేయాలని కోరారు. పైప్ లైన్ కోసం తీసిన కాలువలు గుంతలుగా మారడంతో రోడ్డుపై నడవలేకపోతున్నామని స్థానికులు కిషన్ రెడ్డికి వివరించారు.

## పొంగులేటి ఆత్మీయ సభకు నేతలు



(మొదటి పేజి తరువాయి) వర్గీయులు అడ్డుకున్నారు. బయ్యారం, గార్ల మండలాల నుంచి కార్యక్రమానికి తరలివెళ్తున్న వారిని అడ్డుకోవడంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. మరోవైపు ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఇల్లందులో తలపెట్టిన ఆత్మీయ సమ్మేళనానికి భారీగా జనం తరలి వస్తున్నారు. బయ్యారం, గార్ల మండలాలకు చెందిన బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన 1000 మంది కార్యకర్తలు ఆయా పార్టీలకు రాజీనామా చేశారు. పొంగులేటి, కొత్తగూడెం జిల్లా జెడ్పీ ఛైర్మన్ కోరం కనకయ్య వెంట నడుస్తామని అంటున్నారు.

# వేగంగా తెలంగాణ అభివృద్ధి



(మొదటి పేజి తరువాయి) వివరించారు. ఐటి సెక్టార్ లో తెలంగాణ అతివేగంగా అభివృద్ధి చెందుతుందని, ఏమియేషన్ రంగంలో కూడా తెలంగాణ వేగంగా అభివృద్ధి చెందుంతని మంత్రి అన్నారు. అమెజాన్ ఎయిర్ కార్గో ప్రారంభించడం ఏవియేషన్ రంగంలో మరో అద్భుతమని, అమెజాన్ ఎయిర్ భవిష్యత్తులో మరింత అభివృద్ధి చెందాలని మంత్రి కెటిఆర్ ఆకాంక్షించారు.

# ఎపిలోనూ కెసిఆర్ పాలన కోరుతున్న ప్రజలు



(మొదటి పేజి తరువాయి) ఇప్పుడు పవర్ హాలిడేలున్నాయని, బీఆర్ఎస్‌ను చూసిన తర్వాత బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు వణుకు పుడుతుందన్నారు. ఈ దేశ రైతాంగాన్ని కాపాడాలనే తపని కేసీఆర్‌కు ఉందని, అందుకు బీఆర్ఎస్ పార్టీని స్థాపించారన్నారు.ఓ పెద్ద మనిషి నాగార్జున సాగర్ నియోజకవర్గంలో 15 ఏళ్లుగా మంత్రిగా ఉండి మంచినీళ్లు , రోడ్లు అందుబాటులోకి తేలేకపోయారని పరోక్షంగా జానారెడ్డిపై విమర్శలు గుప్పించారు. నల్గొండ జిల్లా నిడమనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఎంపీ లింగయ్య యాదవ్, డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు భగవత్, భాస్కర్‌రావు, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, కార్పొరేషన్ల చైర్మన్లు రామచంద్ర నాయక్, తిప్పన విజయ సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రధాని మోదీ సొంత రాష్ట్రం గుజరాత్‌లో మంచినీళ్ల సౌకర్యం లేదని, విద్యుత్ కూడా ఆరుగురు మాత్రమే అందుతుందన్నారు. దేశంలో తెలంగాణలోనే 24 గంటల విద్యుత్ అందుతుందన్నారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ఎవరు వచ్చినా సీఎం కేసీఆర్‌ను ఏం చేయలేరని, 60 సంవత్సరాలు దేశాన్ని ఏలిన కాంగ్రెస్, బీజేపీ ఏం అభివృద్ధి చేశారో బేరీజు వేసుకోవాలన్నారు. సీఎం కేసీఆర్ తర్వాత తెలంగాణ ఆకలితో ఉన్నవారు ఎవరూ లేరని అన్ని అంతర్జాతీయ నివేదికలు చెబుతున్నాయన్నారు. దేశాన్ని అధోగతి పాలు చేసింది బీజేపీ, కాంగ్రెస్ పార్టీలేనని, 2014లో మోదీ దేశంలో తిరిగి ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చి నల్లధనాన్ని వెనక్కి తీసుకువచ్చి ఖాతాల్లో జమ చేస్తానని చెప్పారని.. ఇంకా ఎప్పుడు వేస్తారని ప్రశ్నించారు. రూ.2వేలనోట్లతో బీజేపీ నల్లధనం దాచుకుందని, ప్రభుత్వ ఆస్తులను అమ్మతున్న మోదీ చరిత్ర హీనుడిగా మిగిలి పోతాడన్నారు. బీఆర్ఎస్‌ను చూసి బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు భయపడుతున్నాయని మంత్రి జగదీశ్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్, బీజేపీలాంటి ఎన్ని పార్టీలు వచ్చినా సీఎం కేసీఆర్ ను ఏమి చేయలేవన్నారు. నల్గొండ జిల్లా నిడమనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో మంత్రి జగదీశ్ రెడ్డి పాల్గొన్నారు. సీఎం కేసీఆర్ అభివృద్ధి పథకాలతో రాష్ట్రంలో ప్రతి ఒక్కరి తలసరి ఆదాయం పెరిగిందని చెప్పారు. దేశంలో ఒక్క తెలంగాణలోనే 24 గంటల ఉచిత కరెంట్ ఉందన్నారు. ఏపీ ప్రజలు కూడా సీఎం కేసీఆర్ పాలన రావాలని కోరుకుంటున్నట్లుగా జగదీశ్ రెడ్డి తెలిపారు. కేంద్రంపై విమర్శలు చేసిన మంత్రి జగదీశ్ రెడ్డి మోదీ సొంత రాష్ట్రమైన గుజరాత్ లో కనీసం మంచినీళ్ల సౌకర్యం లేదని విమర్శించారు. పేదల ఖాతాల్లో 15 లక్షల వేస్తానని మోదీ చెప్పిన మాట ఏమైందని ప్రశ్నించారు. 60 ఏళ్లుగా దేశాన్ని ఏలిన కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ఏం అభివృద్ధి చేశాయో బేరీజు వేసుకోవాలని సూచించారు.

# సంప్రదాయ సిద్ధంగా నాగోబా జాతర

(మొదటి పేజి తరువాయి) నుంచి పవిత్ర జలం తీసుకొచ్చి.. భాన్ దేవత ఆలయం ముందు ఉన్న పాత పుట్టను తొలగించి.. కొత్త పుట్టను తయారుచేసి పూజ కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీ. ఇచ్చోడ మండలం సిరికొండ నుంచి తెచ్చిన మట్టి కుండల్లో నవ ధాన్యాలు బెల్లం, పప్పు, పిండి, బియ్యంతో నైవేద్యాన్ని తయారు చేసి కుల దేవతలకు మొక్కి నైవేద్యాన్ని సమర్పించారు.ఇక ఈనెల 24 న నిర్వహించే గిరిజన దర్బార్.. నాగోబా జాతరలో మరో ప్రత్యేకం. ఈ దర్బార్‌కు మంత్రి సత్యవతి రాథోడ్, ఇంద్రకరణ్ రెడ్డి, ఎమ్మెల్సీ కవితతో పాటు స్థానిక నేతలు, అధికారులు హాజరవుతారు. కొండలు, కోనలు దాటి వచ్చే గిరిజనుల సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు 1946 ఈ దర్బార్ ను కొనసాగిస్తున్నారు. మెస్రం వంశీయులు ఆచార సంప్రదాయాలు పాటిస్తూ నాగోబాను స్మరిస్తూ ప్రత్యేక పూజలు చేశారు. జాతరకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నలుమూలల నుంచే కాకుండా ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి ఆదివాసీలు, గిరిజనేతరులు భారీగా తరలివచ్చారు. తెలంగాణతో పాటు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌ల నుంచి గిరిజనులు పెద్దఎత్తున వచ్చారు. ఆదివారం నాగోబా జాతరకు కేంద్ర గిరిజనశాఖ మంత్రి అర్జున్ ముండా, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసి పంపితే ఆలయ అభివృద్ధికి నిధులు ఇవ్వడానికి సిద్ధంగా ఉందన్నారు కేంద్ర మంత్రి.

# జివో 317ను వెంటనే రద్దుచేయాలి

(మొదటి పేజి తరువాయి) పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జీవో 317కు వ్యతిరేకంగా బీజేపీ ఉద్యమానికి సిద్ధమవుతోందని బండి సంజయ్ పేర్కొన్నారు. స్వరాష్ట్రంలో టీచర్లు పరాయి బతుకు బతకాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. జీవో 317తో ఉపాధ్యాయుల జీవితాలు చిన్నాభిన్నం అయ్యాయన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయంగా రౌడీ మాదిరిగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కేసీఆర్ హయాంలో ఐఏఎస్ అధికారికే రక్షణ లేకుంటే.. సామాన్యుల పరిస్థితేంటని బండి సంజయ్ ప్రశ్నించారు. ఉద్యోగులు 42రోజుల పాటు సకలజనుల సమ్మె చేయకుంటే తాను సీఎం అయ్యేవాడిని కాదని కేసీఆర్ గుర్తుంచుకోవాలన్నారు. ఉద్యోగ,ఉపాధ్యాయులు సకజనుల సమ్మెతో తెలంగాణ సాధనలో కీలక భూమిక పోషించాలరని అన్నారు. కానీ ఇప్పుడు వారు పారయి పాలనలో బతుకుతున్నారని అన్నారు. కేసీఆర్‌ను ప్రగతి భవన్ నుంచి బయటకు గుంజుకొచ్చే రోజులు దగ్గరలోనే ఉన్నాయని బండి సంజయ్ పేర్కొన్నారు. టీచర్ల అరెస్ట్‌ను తీవ్రంగా ఖండిస్తున్నట్టు తెలిపారు. పోలీసులు కూడా సీఎం కేసీఆర్ బాధితులమేనని గుర్తుంచుకోవాలన్నారు. సాటి ఉద్యోగుల పట్ల పోలీసుల తీరు బాధాకరమని.. జీవో 317పై బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశాల్లో చర్చిస్తామని బండి సంజయ్ వెల్లడించారు. బదిలీలు, ప్రమోషన్ల పేరుతో ప్రభుత్వం కొత్త డ్రామా షురూ చేసిందని బండి సంజయ్ విమర్శించారు. టీచర్ల బదిలీల్లో అక్రమాలు జరుగుతున్నాయని, ట్రాన్స్ ఫర్ల కోసం బీఆర్ఎస్ నేతలు డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు. పైసలివ్వలేదని 13 జిల్లాల్లో స్పౌజ్ బదిలీలు ఆపారా అని ప్రశ్నించారు. ప్రభుత్వం ఉద్యోగులకు ఒకటో తారీఖున ఎందుకు జీతాలు ఇవ్వడం లేదని బండి నిలదీశారు. ఐదేండ్లుగా ఖఖీఅ ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. టీచర్లకు నాలుగు డీఏలు బకాయి ఉన్నారని, ఉద్యోగులను నిర్లక్ష్యం చేస్తే మూల్యం చెల్లించుకోవడం ఖాయమని అన్నారు. రాష్ట్ర ఇదిలావుంటే స్పౌజ్ టీచర్లకు న్యాయం చేయాలంటూ డిమాండ్ చేస్తూ బీజేవైఎం నేతలు, కార్యకర్తలు ప్రగతి భవన్ ముట్టడికి ప్రయత్నించారు. 317 జీవో రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ భారీ సంఖ్యలో పార్టీ కార్యకర్తలు ప్రగతి భవన్ వైపు దూసుకెళ్లేందుకు యత్నించారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు వారిని అరెస్ట్ చేసి పంజాగుట్ట పీఎస్ కు తరలించారు. అనంతరం గోషా మహల్ కు తరలించారు. బీజేపీ ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో భద్రత కట్టుదిట్టం చేశారు. ప్రగతి భవన్‌కు కిలోమీటర్ దూరం వరకు పోలీసులను మోహరించారు. 13 జిల్లాల్లో స్పౌజ్ టీచర్ల బదిలీలను బ్లాక్ చేయడంపై టీచర్లు ఆందోళనకు దిగారు. టీచర్ల ప్రమోషన్లు, బదిలీలకు ముందే తమను బదిలీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. భార్యాభర్తలు వేర్వేరు జిల్లాల్లో పని చేయడం వల్ల తమతో పాటు పిల్లలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి సమస్యను పరిష్కరించాలని అంటున్నారు. అయితే మూడునాలుగు రోజులుగా టీచర్లు ఆందోళన కొనసాగిస్తున్నా ప్రభుత్వం మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని బీజేపీ మండిపడుతోంది. ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులకు మద్దతుగా ప్రగతి భవన్ ముట్టడికి పిలుపునిచ్చింది.

## సర్జికల్ దాడులు అంతా బోగస్



(మొదటి పేజి తరువాయి) ఆరోపణలు గుప్పించారు. 2016, 2019లో పాకిస్థాన్‌లోని ఉగ్రవాద శిబిరాలపై జరిగిన సర్జికల్ దాడులకు సంబందించి మోదీ సర్కారు పార్లమెంట్‌కు ఆధారాలు సమర్పించలేదని దిగ్విజయ్ చెప్పారు. భారత్ జోడో యాత్రలో భాగంగా జమ్మూలో జరిగిన బహిరంగసభలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. దేశ ప్రజలంతా ముందుకొచ్చి కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయాలని దిగ్విజయ్ కోరారు. దిగ్విజయ్ గతంలో కూడా ఈ తరహా వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ వెంట దిగ్విజయ్ కూడా భారత్ జోడో యాత్రలో పాల్గొంటున్నారు. జమ్మూలో జరిగిన బహిరంగ సభలో రాహుల్ మాట్లాడుతూ జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి ఇవ్వాల్సిందే నన్నారు. జమ్మూకశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తికి కాంగ్రెస్ పార్టీ పూర్తి మద్దతు ఇస్తుందని రాహుల్ హామీ ఇచ్చారు. వాస్తవానికి కేంద్ర ప్రభుత్వం 2019 ఆగస్ట్‌లో జమ్మూకశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు చేసింది. 2016, సెప్టెంబర్ 29న పాకిస్థాన్ ఆక్రమిత కాశ్మీర్‌లోని ఉగ్రవాద శిబిరాలపై నియంత్రణ రేఖను దాటి సర్జికల్ దాడులు చేసినట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. దాడుల్లో పాకిస్థాన్‌వైపు పెద్ద సంఖ్యలో మరణాలు సంభవించాయని నాటి మోదీ ప్రభుత్వం తెలిపింది. సెప్టెంబర్ 18న జమ్మూకశ్మీర్‌లోని యూరీలో సైనిక స్థావరంపై పాక్ ప్రేరిత నలుగురు ఉగ్రవాదులు ఆత్మాహుతి దాడి చేశారు. ఈ ఉగ్రదాడిలో 19 మంది భారత సైనికులు చనిపోయారు. ప్రతిగా పది రోజుల్లోనే భారత సైన్యం సర్జికల్ దాడులు నిర్వహించినట్లు భారత సైన్యానికి చెందిన డైరక్టర్ జనరల్ లెఫ్టినెంట్ జనరల్ రణ్‌బీర్ సింగ్ నాడు వెల్లడించారు. 2019 ఫిబ్రవరి 14న జమ్మూకశ్మీర్‌లోని పుల్వామాలో సైనిక కాన్వాయ్‌పై ఉగ్రవాదులు ఆత్మాహుతి దాడి చేశారు. నాటి ఘటనలో 46 మంది సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ సిబ్బంది చనిపోయారు. దీనికి ప్రతీకారంగా భారత్ ఫిబ్రవరి 26న భారత యుద్ధ విమానాలు నియంత్రణ రేఖను దాటి పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని బాలకోట్ సమీపంలో ఉగ్రవాదుల శిబిరాలపై బాంబుల వర్షం కురిపించాయి. మరుసటి రోజు తమ దేశానికి చెందిన ఎఫ్ 16ను కూల్చిన ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ ఫైటర్ పైలట్ అభినందన్ వర్ధమాన్‌ను పాకిస్థాన్ బందీగా చేసుకుంది. ఆ తర్వాత మోదీ సర్కారు వ్యూహంతో పాక్ దారిలోకి వచ్చి మార్చ్ ఒకటిన అభినందన్‌ను విడుదల చేసింది.

## ద్రౌపది ఆలయ ఘటనపై విచారణ



(మొదటి పేజి తరువాయి) అమ్మవారి విగ్రహాలు ఉన్న సమయంలో ఒక్కసారిగా కూలిపోయిందని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. పొంగల్ తర్వాత జరిగే ద్రౌపతి అమ్మన్ ఉత్సవాల్లో భాగంగా ఈ ఊరేగింపు జరిగింది. సోషల్ మీడియాలో వైరల్ అయిన ఈ ఘటనకు సంబంధించిన వీడియోలో క్రేన్ పై కొందరు వేలాడుతుండగా.. మరికొందరు నేలమీద పడిపోతున్నట్లు కనిపిస్తోంది.క్రేన్ ఒక్కసారిగా కూలిపోవడంతో భక్తులు భయంతో పరుగులు తీశారు. సంఘటనా స్థలానికి చేరుకున్నపోలీసులు సహాయక చర్యలు ప్రారంభించారు. క్రేన్ నిలిపిన చోట భూమి చదునుగా లేకపోవడంతోనే బోల్తా పడినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. ప్రమాదానికి సంబంధించి కేసు నమోదుచేసిన పోలీసులు క్రేన్ ఆపరేటర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఆలయ ఉత్సవాల్లో క్రేన్ ఉపయోగించేందుకు అనుమతి తీసుకోలేదని పోలీసులు చెప్పారు.

## స్మితా సబర్వాల్ ఇంట్లోకి జొరబాటు ఘటన

(మొదటి పేజి తరువాయి) తెలుస్తోంది. గతవారం జూబ్లీహిల్స్ లోని ఓ గేటెడ్ కమ్యూనిటీలో ఉంటున్న ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ ఇంట్లోకి మేడ్చల్ జిల్లాకు చెందిన డిప్యూటీ తహసీల్దార్ ఆనంద్ కుమార్ రెడ్డి చొరబడ్డారు. అతన్ని చూసి స్మితా సబర్వాల్ కేకలు వేయడంతో అప్రమత్తమైన భద్రతా సిబ్బంది నిందితున్ని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనలో డిప్యూటీ తహసీల్దార్ తో పాటు అతడి ఫ్రెండ్ ను కూడా అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు. తన ఇంట్లో డిప్యూటీ తహసీల్దార్ చొరబాటుపై ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ స్పందించారు. తనకు బాధాకరమైన అనుభవం ఎదురైందని ట్వీట్ చేశారు. తన ఇంట్లోకి ఒక వ్యక్తి చొరబడ్డాడని, తాను వెంటనే అప్రమత్తమై చాకచక్యంగా తన ప్రాణాలు కాపాడుకున్నానని చెప్పారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలన్న స్మితా... రాత్రిపూట డోర్లు, తాళాలు చెక్ చేసుకోవాలని, ఎమర్జెన్సీ సమయంలో డయల్ 100కు ఫోన్ చేయాలని సూచించారు.



## గురుకుల పీఈటీ ఫలితాలను విడుదల చేయాలి


హైదరాబాద్, జనవరి23(సమ సమాజం): హైకోర్టు తీర్పును అనుసరించి 2017 గురుకుల పీఈటీ ఫలితాలను తక్షణమే విడుదల చేయాలంటూ అభ్యర్థులు వినూత్న నిరసనకు దిగారు. దాదాపు 50 మంది అభ్యర్థులు బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 12లోని స్మశాన వాటిక ఎదుట ఆందోళనకు చేపట్టారు. ప్ల కార్డులు పట్టుకుని ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. టీఎస్పీఎస్సీ వెంటనే గురుకుల పీఈటీ మెరిట్ లిస్ట్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. తమకు న్యాయం చేయకపోతే కుటుంబాలతో సహా స్మశానాలకే పరిమితం కావాల్సి వస్తుందని అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేశారు. నిరసనకారులను అదుపులోకి తీసుకున్న పోలీసులు బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

## నేడు కొండగట్టుకు జనసేనాని పవన్ కళ్యాణ్



(మొదటి పేజి తరువాయి) అభ్యర్థుల్ని బరిలోకి దించే దిశగా జనసేన అధినేత పవన్ కల్యాణ్ అడుగులు వేస్తున్నట్టు తెలుస్తోంది. వారాహి వాహనంతోపాటు హైదరాబాద్ నుంచి ఉదయం 7 గంటలకు పవన్ కల్యాణ్ జగిత్యాల జిల్లా కొండగట్టు ఆంజనేయస్వామి దేవాలయానికి బయలుదేరుతారు. అక్కడ ఉదయం 11 గంటలకు పవన్ కల్యాణ్ చేరుకుని వారాహికి ప్రత్యేక పూజలు జరిపించనున్నారు. అక్కడనుండి మధ్యాహ్నం 1 గంటలకు నాచుపల్లి శివారులోని బృందావన్ రిసార్ట్‌లో పార్టీ ముఖ్య నేతల సమావేశంలో పవన్ పాల్గొంటారు. రాబోయే రోజుల్లో తెలంగాణలో పార్టీ అనుసరించే వ్యూహం చేపట్ట బోయే కార్యక్రమాలపై పవన్ కళ్యాణ్ చర్చించి దిశానిర్దేశర చేస్తారు. నంతరం కొడిమ్యాల మండలం నాచుపల్లిలో ముఖ్యనేతలతో భేటీ అవుతారు. సాయంత్రం 4 గంటలకు ధర్మపురిలో శ్రీ లక్ష్మి నరసింహ స్వామికి ప్రత్యేక పూజలు చేస్తారు. పవన్ ముందుగా అనుకున్న అనుష్టుప్ నారసింహయాత్ర (32 నారసింహ క్షేత్రాల సందర్శన) ప్రారంభమవుతుంది. ఈ యాత్రలో భాగంగా ధర్మపురిలోని శ్రీ లక్ష్మి నారసింహ క్షేత్రంలో పూజలు జరిపి శ్రీకారం చుడతారు. అనంతరం మిగిలిన 31 నారసింహ క్షేత్రాలను పవన్ కళ్యాణ్ సందర్శిస్తారని జనసేన వర్గాలు వెల్లడించాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లా యాత్ర అనంతరం పవన్ కల్యాణ్ తిరిగి సాయంత్రం 5:30 గంటలకు హైదరాబాద్ కి తిరుగు ప్రయాణం అవుతారు. పవన్ రాకతో జిల్లాలో పోలీసులు కూడా అప్రమత్తం అయ్యారు.

## బీఎస్ఎన్ఎల్ కొత్త ఓటీటీ సబ్ స్క్రిప్షన్స్ ప్లాన్




హైదరాబాద్, జనవరి23(సమ సమాజం): మార్కెట్లో ప్రస్తుతం ఓటీటీ ప్లాట్ ఫామ్స్ కు మస్త్ క్రేజ్ ఉంది. కరోనా టైం నుంచి ఓటీటీ యూజర్లు పెరిగిపోయారు. దాన్ని దృష్టిలో పెట్టుకొని టెలికాం కంపెనీ బీఎస్ఎన్ఎల్ కొత్త ఓటీటీ సబ్ స్క్రిప్షన్స్ ప్లాన్ తీసుకొచ్చింది. రూ. 249కే 8 ఓటీటీ ప్లాట్ ఫామ్స్ అందుబాటులోకి తీసుకురానుంది. అయితే, ఆ సర్వీస్ ను కేవలం బీఎస్ఎన్ఎల్ బ్రాడ్ బాండ్ కస్టమర్లు మాత్రమే పొందగలరు. ఈ ప్లాన్ తో జీ 5, సోనీ లివ్, వూట్ సెలెక్ట్, యప్ టీవీ, అహా, లయన్స్‌గేట్ ప్లే, హంగామా, డిస్నీ హాట్‌స్టార్ తదితర ఎ÷-లాట్‌ఫామ్స్ సబ్‌స్క్రిప్షన్ పొందొచ్చు.

# రవిశాస్త్రికి ఆ మ్యాచ్ లో ధోనీ తీరు నచ్చలేదట



**న్యూఢల్లీ,జనవరి23(సమ సమాజం):** టీమిండియా మాజీ కోచ్ రవిశాస్త్రి మిస్టర్ కూల్, మాజీ కెప్టెన్ ధోనీపై సీరియస్ అయ్యాడట. ఇప్పుడు ఈ వార్త నెట్టింట ఫుల్ వైరల్‌గా మారింది. ఈ విషయాన్ని టీమిండియా మాజీ ఫీల్డింగ్ కోచ్ ఆర్ శ్రీధర్ తన తాజా బుక్ 'కోచింగ్ బియాండ్: మై డేస్ విత్ ద ఇండియన్ క్రికెట్ టీమ్'లో రాశాడు. ఇందులో ఇప్పటి వరకూ క్రికెట్ ఫ్యాన్స్‌కు తెలియని ఎన్నో ఆశ్చర్యకర విషయాలు కూడా ఉన్నాయి. ధోనీపై అప్పటి కోచ్ రవిశాస్త్రి సీరియస్ అవడం కూడా ఇందులో ఒకటి. 2018లో ఇంగ్లాండ్‌తో వన్డే సిరీస్ సందర్భంగా ఈ ఘటన జరిగిందట. తొలి వన్డేలో 8 వికెట్లతో ఇండియా గెలిచినా.. తర్వాతి మ్యాచ్‌లో 86 రన్స్ తేడాతో పరాజయం పాలైంది. అయితే ఈ పోరులో మహీ కనీసం ఫైట్ చేయకుండానే చేతులెత్తేసిన తీరు కోచ్ రవిశాస్త్రికి నచ్చలేదని శ్రీధర్ తెలిపాడు. ఆ మ్యాచ్‌లో కోహ్లీ, రైనా క్రీజులో ఉన్నంత వరకూ ఆశలు ఉన్నా.. తర్వాత వెంటవెంటనే ఈ ఇద్దరితోపాటు హార్దిక్ కూడా ఔటవడం ఇండియా ఓటమికి కారణమైంది. "టీమిండియా విజయానికి 66 బంతుల్లో 133 రన్స్ అవసరం. టెయిలెండర్లతో కలిసి ధోనీ క్రీజులో ఉన్నాడు. అయితే అతడు మాత్రం విజయం కోసం ఏమాత్రం ప్రయత్నించకుండా నెమ్మదిగా ఆడాడు. ఈ ఇన్నింగ్స్‌లోనే ధోనీ వన్డేల్లో 10 వేల రన్స్ కూడా పూర్తిచేసుకున్నాడు. అయితే చివరికి అతడు 59 బంతుల్లో కేవలం 37 రన్స్ చేసి 47వ ఓవర్లో ఔటయ్యాడు. ఇదే రవిశాస్త్రికి కోపం తెప్పించింది. 86 రన్స్‌తో ఓడిపోయినందుకు కాదు కానీ.. కనీసం పోరాడకుండానే చేతులెత్తేయడం అతనికి నచ్చలేదు. అందుకే మూడో వన్డేకు ముందు డ్రెస్సింగ్ రూమ్‌లో మీటింగ్ పెట్టాడు. అప్పుడు నేరుగా ధోనీ కళ్లలోకి చూస్తూ రవి ఇలా చెప్పాడు. 'మీరు ఎవరైనా సరే.. గెలవడానికి ప్రయత్నించకుండా మరో మ్యాచ్ ఓడిపోయే పరిస్థితి మళ్లీ రాకూడదు. నా కోచింగ్‌లో ఇలాంటిది జరగకూడదు. ఒకవేళ ఎవరైనా అలా చేస్తే మాత్రం అతనికి అదే చివరి మ్యాచ్ అవుతుంది. మ్యాచ్ ఓడిపోవడంలో సిగ్గు పడాల్సిందేమీ లేదు. కానీ ఇలా మాత్రం ఓడకూడదు" అని రవిశాస్త్రి అన్నట్లు శ్రీధర్ తన బుక్‌లో రాసుకొచ్చాడు.

# బీబీఎల్‌లో సత్తాచాటిన ఫించ్



**మెల్‌బోర్న్, జనవరి23(సమ సమాజం):** బీఎల్‌లో ఫించ్ తన సత్తా చాటాడు. మెల్‌బోర్న్ రెనిగేడ్స్ తరపున ఆడుతున్న అతను.. పెర్త్ స్కార్చర్స్ బౌలర్ ఆండ్రూ టైను ఉతికారేశాడు. బీబీఎల్ చరిత్రలోనే ఆ ఓవర్‌లో అత్యధిక పరుగలు వచ్చాయి. పెర్త్: బిగ్ బాష్ లీగ్ చరిత్రలోనే ఆదివారం అత్యధిక పరుగులు వచ్చిన ఓవర్ నమోదు అయ్యింది. ఆండ్రూ టై వేసిన ఓవర్‌లో ఫించ్ చెలరేగిపోయాడు. పెర్త్ స్కార్చర్స్ పేస్ బౌలర్ వేసిన బౌలింగ్‌లో ఫించ్ 31 రన్స్ రాబట్టాడు. పెర్త్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో మెల్‌బోర్న్ రెనిగేడ్స్ బ్యాటర్ ఫించ్ దుమ్మురేపాడు. ఏడు బంతులు వేసిన ఆ ఓవర్‌లో ఫించ్ 30 రన్స్ చేయగా.. ఒక రన్ వైడ్‌రూపంలో వచ్చింది. ఇన్నింగ్స్ 18వ ఓవర్‌లో టై వేసిన ఫస్ట్ బంతికి ఫించ్ రెండు రన్స్ తీశాడు. ఆ తర్వాత వరుసగా రెండు ఫోర్లు కొట్టాడు. ఇక నాలుగో బంతిని మళ్లీ రెండు రన్స్ తీశాడు. ఆ తర్వాత నో బాల్‌కు సిక్సర్ కొట్టాడు. మళ్లీ వరుసగా రెండు సిక్సర్లు బాదాడు. ఫించ్ 35బంతుల్లో 76 రన్స్ చేసినా.. మెల్‌బోర్న్ రెనిగేడ్స్ జట్టు 10 రన్స్ తేడాతో పెర్త్ స్కార్చర్స్ చేతిలో ఓటమి పాలైంది.

# టీ20 జట్టులో ముగ్గురు భారత క్రికెటర్లకు చోటు

**కోహ్లీ, సూర్యకుమార్ , పాండ్యాల అవకాశం**

**టీ20 జట్టును ప్రకటించిన ఐసీసీ**



**న్యూఢల్లీ,జనవరి23(సమ సమాజం):** పురుషుల టీ20 జట్టును ఐసీసీ సోమవారం ప్రకటించింది. 2022 సంత్సరానికి గానూ 11 మంది ఆటగాళ్లను ఎంపిక చేసింది. భారత జట్టు నుంచి అత్యధికంగా ముగ్గురు క్రికెటర్లు ఈ జట్టులో చోటు దక్కించుకున్నారు. విరాట్ కోహ్లీ, సూర్యకుమార్ యాదవ్, ఆల్‌రౌండర్ హార్ధిక్ పాండ్యాకు ఐసీసీ టీ20 జట్టుకు ఎంపికయ్యారు. ఇంగ్లండ్ టీమ్ నుంచి జోస్ బట్లర్, ఆల్‌రౌండర్ సామ్ కరన్, పాక్ నుంచి రిజ్వాన్, హ్యారిస్ రౌఫ్‌లను సెలక్ట్ చేసింది. ఈ లిస్టులో స్పిన్నర్ హసరంగ (శ్రీలంక), సికిందర్ రజా (జింబాబ్వే), జోష్ లిటిల్ (ఐర్లాండ్), గ్లెన్ ఫిలిప్స్ (న్యూజిలాండ్) ఉన్నారు. ఈ టీమ్‌కు జోస్ బట్లర్‌ను కెప్టెన్, వికెట్ కీపర్‌గా ఎంపిక చేసింది. రిజ్వాన్, బట్లర్‌లను ఓపెనింగ్ జోడీగా ప్రకటించింది. జట్టు ఇదే.. జోస్ బట్లర్ (కెప్టెన్, వికెట్ కీపర్), మొహమ్మద్ రిజ్వాన్, విరాట్ కోహ్లీ, సూర్యకుమార్ యాదవ్, గ్లెన్ ఫిలిప్స్, సికిందర్ రజా, హార్ధిక్ పాండ్యా, సామ్ కరన్, వనిందు హసరంగ, హ్యారిస్ రౌఫ్, జోష్ లిటిల్.

# మహిళల ఐపీఎల్ పై బడా కంపెనీల ఆసక్తి

**న్యూఢల్లీ,జనవరి23(సమ సమాజం):** 25న జరగబోయే మహిళల ఐపీఎల్ జట్లు వేలం పాటు ప్రక్రియ జరగనుంది. ఈ వేలం పాట ద్వారా దాదాపు మరో రూ.4 వేల కోట్లు బీసీసీఐ ఖాతాలోకి చేరనున్నట్లు తెలుస్తోంది ఇండియన్ ప్రీమియర్ లీగ్?తో(ఐపీఎల్) బీసీసీఐ రాతే మారిపోయింది. గత 15 ఏళ్లుగా క్రికెట్? అభిమానులను ఊర్రూతలూగిస్తున్న ఈ క్యాష్ రిచ్ లీగ్.. క్రికెట్ ప్రపంచాన్ని శాసిస్తోంది. ఈ ధనాధన్ లీగ్ ఆడేందుకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆటగాళ్లంతా క్యూ కడుతుంటారు. ఇంకా చెప్పాలంటే ఈ మెగా లీగ్? కారణంగా రెండు నెలల పాటు అంతర్జాతీయ క్రికెటే ఆగిపోతుందంటేనే ఈ లీగ్? పవర్ ఏంటో అర్థం చేసుకోవచ్చు. ఇక ఐపీఎల్ 2022 సీజన్‌లో కొత్తగా రెండు జట్లను ప్రవేశపెట్టి వేల కోట్ల ఆదాయాన్ని పెంచుకున్న బీసీసీఐ.. ఈ ఏడాది నుంచి మహిళల ఐపీఎల్?ను (డబ్ల్యూఐపీఎల్) నిర్వహించి తమ ఆదాయాన్ని మరింత రెట్టింపు చేసుకోబోతుంది. ఈ ఏడాది మార్చిలో నిర్వహించనున్న ఈ మహిళల ఐపీఎల్ కోసం ఇప్పటికే బీసీసీఐ ఏర్పాట్లను ముమ్మరం చేసిన సంగతి తెలిసిందే. తొలుత ఐదు జట్లతో ఈ లీగ్‌ను ప్రారంభించనుంది. ఈ మహిళల జట్లను కొనుగోలు చేసేందుకు బడా కంపెనీలు సైతం ఆసక్తి చూపించాయి. ఈ క్రమంలోనే ఇటీవలే దీనికి సంబంధించి ఐదు టెండర్లను ఆహ్వానించింది బీసీసీఐ. దాదాపు 30కు పైగా అగ్ర శ్రేణి కంపెనీలు టెండర్ల దరఖాస్తులను కొనుగోలు చేశాయి. ఇందులో మెన్స్ ఐపీఎల్ జట్లను కొనుగోలు చేసిన 10 కంపెనీలతో పాటు ఇంగ్లీష్ ఫుట్‌బాల్ లీగ్‌కు చెందిన మాంచెస్టర్ యునైటెడ్, భారత స్నాక్ బ్రాండ్ హల్దీరామ్స్ కూడా పోటీలో ఉన్నాయి. 25వ తేదీన వేలంలో పాల్గొననున్నాయి. అయితే తాజాగా మార్కెక్? ఎక్స్?పర్ట్? నుంచి అందిన సమాచారం ప్రకారం ఒక్కో జట్టును దాదాపు రూ.600 కోట్లకు పైగా అమ్ముడుపోయే అవకాశం ఉందని తెలిపారు. ఒకేవేళ ఈ రేంజ్?లో ఒక్కో జట్టు ధర పలికితే.. మొత్తంగా మరో నాలుగు వేల కోట్ల వరకు బీసీసీఐ ఖాతాలోకి చేరే అవకాశం ఉంది. "మహిళల ఐపీఎల్? భారీ సామర్థ్యాన్ని కలిగి ఉంది. ఈ బిడ్స్? ద్వారా ఒక్కో జట్టు రూ.500 నుంచి రూ.800కోట్ల వరకు అమ్ముడుపోయే అవకాశం ఉంది" అని ఇంతకుముందు పురుషుల ఐపీఎల్? బిడ్ల టీమ్?లో పని చేసిన ఓ అధికారి తెలిపారు. కాగా, ఐపీఎల్ ప్రసార (మీడియా) హక్కుల్ని వయాకామ్ 18 సొంతం చేసుకుంది. అయిదేళ్ల కాలానికి గాను రూ.951 కోట్లకు ప్రసార హక్కులు వయాకామ్ 18 వశమైనట్లు బీసీసీఐ ప్రకటించింది. ఒక్కో మ్యాచ్‌కు వయాకామ్.. రూ.7.09 కోట్లు చెల్లించనున్నట్లు బోర్డు పేర్కొంది. ఛాంపియన్ జట్టుకు ఎంతంటే?.. సమాచారం ప్రకారం ఛాంపియన్? జట్టుకు బీసీసీఐ ఆదా రూ. 28.08 కోట్లు దక్కుతుందని తెలిసింది. రెండో స్థానంలో నిలిచిన జట్టుకు రూ.27.20 కోట్లు, ఆ తర్వాత స్థానాల్లో రూ.26.33 కోట్లు, రూ.25.45 కోట్లు, రూ.24.57 కోట్లు లభిస్తాయి. అయితే ఇది 2027 వరకు ప్రతి సంవత్సరం పెరుగుతుంటుంది.అప్పుడే ప్రారంభం.. మహిళల ఐపీఎల్ తొలి సీజన్ మార్చి మొదటి వారం నుంచి ప్రారంభం కానుంది. 5 జట్లు 22 మ్యాచ్‌లు ఆడనున్నాయి. జనవరి 25న అన్ని జట్ల పేర్లను వెల్లడించిన తర్వాత, ఫిబ్రవరిలో ఆటగాళ్ల వేలం ఉంటుంది. వేలంలో ఒక్కో జట్టు రూ.12 కోట్ల పర్స్‌ను కలిగి ఉంటుంది. ఇకపోతే.. వాంఖడే, డీవై పాటిల్ వంటి పెద్ద మైదానాలు ఉన్న కారణంగా లీగ్ మొత్తాన్ని ముంబయి వేదికగా నిర్వహించేందుకు బీసీసీఐ యోచిస్తున్నట్టుగా తెలుస్తోంది. దీనిపై అధికారిక వెల్లడించాల్సి ఉంది.







## సల్మాన్ చిత్రం కోసం అభిమానుల ఎదురుచూపు



సల్మాన్ ఖాన్‌ను గత రెండేళ్లుగా వరుస ఫ్లాపులు ఇబ్బంది పెడుతున్నాయి. నిజానికి గతేడాది సల్మాన్ నుండి ఒక్క సినిమా కూడా రాలేదు. ఆ ముందటి ఏడాది రెండు సినిమాలు విడుదల కాగా.. రెండూ నిర్మాతలకు తేరుకోని నష్టాల్ని మిగిల్చాయి. దాంతో సల్మాన్ కొంచెం గ్యాప్ తీసుకుని రెండు సినిమాలతో అభిమానులలో ఉత్సాహం నింపడానికి రెడీ అయ్యాడు. సల్మాన్ ప్రస్తుతం రెండు సినిమాలు సెట్స్‌మీద ఉంచాడు. అందులో 'కిసీ కా భాయ్ కిసీ కా జాన్' ఒకటి. ఈద్ సందర్భంగా ఏప్రిల్ 4న ఈ మూవీ రిలీజ్ కానుంది. అయితే ఇప్పటి వరకు ఈ సినిమాకు సంబంధించిన మేజర్ అప్‌డేట్ ఒక్కటి కూడా ఇవ్వలేదు. దాంతో అభిమానులు చిత్రబృందం తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. కాగా తాజాగా సల్లూ భాయ్ అభిమానులకు అదిరిపోయే న్యూస్ చెప్పాడు. ఈ సినిమా టీజర్‌ను రిపబ్లిక్‌డే కానుకగా ఒకరోజు ముందే రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించాడు. ఈ మేరకు స్పెషల్ పోస్టర్‌ను రిలీజ్ చేశాడు. ఈ ప్రకటనతో సల్మాన్ అభిమానులు ఫుల్ ఖుషీ అవుతున్నారు. ఫర్హాద్ సమ్‌జీ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో పూజా హెగ్డే హీరోయిన్‌గా నటిస్తుంది. టాలీవుడ్ అగ్ర నటుడు వెంకటేష్ కీలకపాత్ర పోషిస్తున్నాడు. ఈ సినిమా తమిళంలో సూపర్ హిట్టయిన వీరమ్‌కు రీమేక్‌గా తెరకెక్కుతుంది. తెలుగులో వీరుడొక్కడే పేరుతో డబ్బింగ్ అయింది. సల్మాన్ ఖాన్ తన సొంత బ్యానర్‌పై ఈ సినిమాను నిర్మిస్తున్నాడు. జగపతిబాబు కీలకపాత్రలో నటిస్తున్న ఈ సినిమాకు దేవి ప్రసాద్ సంగీత దర్శకుడిగా వ్యవహరిస్తు?న్నాడు

## మైఖేల్ విజయంపైనే సందీప్ ఆశలు



టాలీవుడ్ యంగ్ హీరో సందీప్ కిషన్ కమర్షియల్ హీరో గుర్తింపు కోసం ఎంతో ప్రయత్నిస్తున్నాడు. కెరీర్ బిగెనింగ్ నుండి విభిన్న సినిమాలు చేస్తున్నా కమర్షియల్ హీరోగా గుర్తింపు తెచ్చుకోలేకపోతున్నాడు. 'వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్', 'బీరువా', 'ఏ1 ఎక్స్‌ప్రెస్' వంటి పలు సినిమాలు కమర్షియల్‌గా మంచి విజయాలే సాధించినా.. సందీప్‌కు మాత్రం స్టార్ స్టేటస్ తెచ్చిపెట్టలేకపోయాయి. ఈ క్రమంలో రెండేళ్ల గ్యాప్ తీసుకుని 'మైఖేల్' వంటి పాన్ ఇండియా సినిమాతో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమయ్యాడు. రంజిత్ జయంకోడి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో విజయ్ సేతుపతి కీలకపాత్ర పోషిస్తున్నాడు. ఇప్పటికే రిలీజైన పోస్టర్‌లు, టీజర్‌కు ప్రేక్షకుల నుండి విశేష స్పందన వచ్చింది. తాజాగా ఈ సినిమ ట్రైలర్ రిలీజైంది.లేటెస్ట్‌గా రిలీజైన ట్రైలర్ గూస్‌బంప్స్ తెప్పిస్తుంది. ట్రైలర్ మొత్తం యాక్షన్ సన్నివేశాలతో నిండిఉంది. అయితే ట్రైలర్‌లో ఎక్కువగా ఏమి రివీల్ చేయలేదు. కానీ హీరోయిన్ చుట్టూ ఈ సినిమా కథ జరుగుతుందని స్పష్టంగా తెలుస్తుంది. మరి హీరోయిన్ ఎవరు? అసలు హీరోయిన్‌కు ఏమైంది? హీరోయిన్ కోసం సందీప్ గ్యాంగ్‌స్టార్‌గా ఎందుకు మారాల్సి వచ్చింది? అనే పలు విషయాలను సస్పెన్స్‌లో పెట్టారు. విజయ్ సేతుపతి క్యారెక్టర్ పవర్ ఫుల్‌గా ఉండనున్నట్లు ట్రైలర్ చూస్తే తెలుస్తుంది. గౌతమ్ మీనన్ ఇంటెన్సీవ్ పాత్రలో నటిస్తున్నాడు. ఇక వరుణ్ సందేష్ కొత్తగా కనిపిస్తున్నాడు. వరలక్ష్మీ క్యారెక్టర్ కూడా స్టాం÷-రగ్‌గా ఉన్నట్లు తెలుస్తుంది. మొత్తంగా ఒక్క ట్రైలర్‌తో ఎక్కడ లేని అంచనాలు క్రియేట్ అయ్యాయి. ఫీమేల్ క్యారెక్టర్‌లకు ఈ సినిమాలో మంచి ఇంపా÷-టగ్గ÷న్స్ ఉన్నట్లు ట్రైలర్‌తో స్పష్టమవుతుంది. లవ్ కమ్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కిన ఈ సినిమా ఫిబ్రవరి 3న పాన్ ఇండియా లెవల్లో రిలీజ్ కాబోతుంది. సందీప్‌కు జోడీగా దివ్యాంశ కౌశిక్ నటిస్తుంది.

# 75వ సినిమాను ప్రకటించిన వెంకటేశ్

ఎట్టకేలకు వెంకటేష్ తన 75వ సినిమాను ప్రకటించేశాడు. గతకొన్ని నెలలుగా వెంకటేష్ 75వ సినిమా గురించి ఎన్నో రకాల చర్చలు. ఎంతో మంది దర్శకులు పేర్లు. మొదటగా అగ్ర దర్శకుడు త్రివిక్రమ్ పేరు వినిపించింది. ఆ తర్వాత త్రినాథ్ రావు నక్కిన, తేజ, అనీల్ రావిపూడి అని చాలా మంది పేర్లు వినిపించాయి. కానీ అవి పేర్ల వరకే పరిమితమైపోయాయి. ఒకనొక దశలో వెంకీమామా సినిమాలకు గుడ్‌బై పెట్టనున్నాడా అనే డౌట్స్ కూడా చాలా మందిలో వచ్చాయి. అయితే తాజాగా వాటికి వెంకీమామా ఫుల్‌స్టాప్ పెడ్డాడు. గతకొన్ని రోజులుగా వెంకటేష్ తన తదుపరి సినిమాను సైలేష్ కొలను దర్శకత్వంలో చేయబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. కాగా వాటిని నిజం చేస్తూ మేకర్స్ తాజాగా ప్రీలుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఈ పోస్టర్‌లో వెంకీ చేతిలో ఏదో పట్టుకుని ఉన్నాడు. అదేంటో తెలియాలంటే జనవరి 25 వరకు వేచి చూడాల్సిందే అంటున్నారు మేకర్స్. గత కొన్నేళ్లుగా వెంకటేష్ కామెడీ సినిమాలపై ఫోకస్ పెడుతూ.. మాస్ సినిమాల వంక కూడా చూడలేదు. కాగా చాలా కాలం తర్వాత ఈ సినిమాలో మాస్ చొక్కా ధరించనున్నట్లు తెలుస్తుంది. ఇక ఈ సినిమాకు సంబంధించిన పూర్తి విషయాలు జనవరి 25ను వెల్లడికానున్నాయి



# శరవేగంగా సలార్ సూటింగ్



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ కథానాయకుడిగా కేజీఎఫ్ దర్శకుడు ప్రశాంత్ నీల్ తెరకెక్కిస్తున్న భారీ యాక్షన్ ఎంటర్ టైనర్ 'సలార్'. ఈ చిత్రాన్ని హోంబలే ఫిలింస్ దాదాపు 400 కోట్లు పైగా బ్జడెట్ ని ఖర్చు చేస్తోందని ఇటీవల కథనాలొచ్చాయి.ఈ సినిమా ఈ ఏడాది మోస్ట్ అవైటెడ్ జాబితాలో ట్రెండింగులో ఉంది. షూటింగ్ ప్రధాన భాగం హైదరాబాద్ సహా పలు అరుదైన లొకేషన్లలో భారీ సెట్లలో తెరకెక్కిన సంగతి తెలిసిందే. ఇక ఈ చిత్రం యాక్షన్ మునుపెన్నడూ ఇండియన్ సినిమా హిస్టరీలో లేనంత కొత్తగా ఉంటుందన్న చర్చా సాగుతోంది. ప్రశాంత్ నీల్ సలార్ ÷-లకైమాక్స్గ ÷ట్ తో పాటు సినిమాలో ఆరు భారీ యాక్షన్ ఎపిసోడ్ లను ప్లాన్ చేశారని కథనాలొచ్చాయి. స్టంట్ మాస్టర్స్ ఇప్పటికే కొన్ని యాక్షన్ ఎపిసోడ్ లను రూపొందించారు. గోదావరిఖనిలో ఓ యాక్షన్ ఎపిసోడ్ ను కూడా తెరకెక్కించారు. ఇటీవల పతాకసన్నివేశంలో భారీ యాక్షన్ దృశ్యాల కోసం పాపులర్ హాలీవుడ్ స్టంట్ కొరియోగ్రాఫర్ ని బరిలో దించారని కథనాలొచ్చాయి. అతడి చేరికతో సలార్ యాక్షన్ మరో లెవల్ ని టచ్ చేస్తుందని సినిమాకి ఈ దృశ్యాలు మరో హైలైట్ గా నిలుస్తాయని చెబుతున్నారు. అలాగే శ్రుతిహాసన్ పాత్ర ఇందులో ఎంతో ట్రాజిక్ గా ఎంతో ఎమోషన్ ని రగిలిస్తుందని కూడా చెబుతున్నారు. ఇక ఈ సినిమాతో ప్రభాస్ రేంజ్ అమాంతం పాన్ వరల్డ్ కి రీచ్ అవ్వాలన్నది కేజీఎఫ్ దర్శకుడు ప్రశాంత్ నీల్ పంతం. దీంతో ప్రభాస్ మాస్ కటౌట్ ని ఒక రేంజులో ఉపయోగించుకున్నాడని టాక్ వినిపిస్తోంది. ముఖ్యంగా యాక్షన్ సన్నివేశాల్లో రాఖీ భాయ్ (కేజీఎఫ్ యష్) ని మించిన కరిష్మాతో ప్రభాస్ అలరించబోతున్నాడు. ఈ చిత్రంలో నటుడు పృథ్వీరాజ్ కీలక పాత్ర పోషిస్తున్నారు. 28 సెప్టెంబర్ 2023న అత్యంత భారీగా సలార్ విడుదల కానుంది.ప్రభాస్ నుంచి రెండు రిలీజ్ లు పక్కా 2023లో ప్రభాస్ నటించిన రెండు సినిమాలు పక్కాగా రిలీజ్ కాబోతున్నాయి. ఆదిపురుష్ జూన్ 16న విడుదల కానుండగా.. సలార్ సెప్టెంబరు 28న రిలీజ్ ఖాయం అంటూ ఇప్పటికే విడుదల తేదీలను చిత్రబృందాలు ఖాయం చేసాయి.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8464816456 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in